

స్వతంత్ర దినోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ (ఫైల్)

# ఆకలి తీర్చే సుఖీభవ

- గాంధీ దవాఖాన వద్ద రోగుల బంధువుల కోసం నిత్యాన్నదానం
- 200మందికి భోజనమందిస్తున్న సేవా సంస్థ

చిక్కడపల్లి : గాంధీనగర్‌కు చెందిన సుధాకర్ సేవా కార్యక్రమాలను నిర్వహించడం అలవాటుగా మార్చుకున్నాడు. 10 సంవత్సరాలుగా స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు ప్రముఖుల జన్మదినాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చాడు. ఆరుగురు సభ్యులతో కలిసి సుఖీభవ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాడు. ఓ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహిస్తుండంగా.. గాంధీ ఆసుపత్రిలో రోగుల బంధువుల కోసం అన్నదానం చేయాలని సుధాకర్‌కు కొందరు సూచించారు. సుధాకర్ అక్కడ ఒకరోజు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టాడు. ఆ సమయంలో అక్కడ ఆకలితో అలమటిస్తున్న రోగుల బంధువుల దీనపరిస్థితి చూసి చలించిపోయాడు. వెంటనే రోగుల బంధువుల కోసం ప్రతిరోజు అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. అధికారులను సంప్రదించడంతో దవాఖాన ప్రాంగణంలోని ఆశ్రమంలో ప్రతిరోజు అన్నదానం చేసేందుకు అనుమతించారు. జూన్ 16న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి క్రమతప్పకుండా ప్రతిరోజు రాత్రి 7 గంటలు నుంచి.. దాదాపు 200మందికి అన్నదానం చేస్తున్నారు.

### సొంత డబ్బులతో..

ప్రతిరోజు 200మందికి అన్నదానం కోసం 5వేలకు పైగా ఖర్చు అవుతోంది. దాతలు ముందుకురాకపోయినా నిత్య అన్నదానం కార్యక్రమం నిలిచిపోవద్దని సొంతడబ్బులు ఖర్చు చేసి సుధాకర్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు అన్నదానం చేయడానికి గాంధీనగర్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వంట సామగ్రి, ఓ వ్యాన్ సైతం కొనుగోలు చేశాడు. తను చేస్తున్న చిరు వ్యాపారంలో వచ్చే ఆదాయం కొంతే అయినా.. సేవాభావంతో అన్నదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఈ కార్యక్రమానికి సుధాకర్ భార్య రజిని కుమారి కూడా సహకరిస్తోంది.

### దాతలు సహకరించాలి..



వివిధ జిల్లాల నుంచి గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వస్తున్న రోగులు, వారితో వచ్చే సహాయకులంతా నిరుపేదలే. వారంతా తిండికి సైతం డబ్బుల్లేక దవాఖాన వద్ద ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివారి కడుపు నింపడం కోసమే 'సుఖీభవ' సంస్థ పని చేస్తోంది. దాతలు ముందుకొచ్చి సహకరిస్తే మరింత సమర్థవంతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. వివరాలకు 94923 85240, 92471 79343లను సంప్రదించాలి.

-బి.సుధాకర్, సుఖీభవ సంస్థ చైర్మన్